06-05-2024 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - ఈ జన్మలోని పాపాల నుండి తేలికగా అయ్యేందుకు తండ్రికి సత్యాతి-సత్యముగా అంతా వినిపించండి మరియు గత జన్మలలోని వికర్మలను యోగాగ్ని ద్వారా సమాప్తము చేసుకోండి"

ప్రశ్న:- ఈశ్వరీయ సేవాధారులుగా అయ్యేందుకు ఏ ఒక్క చింత ఉండాలి?

జవాబు:- మేము స్మృతియాత్రలో ఉంటూ పావనంగా తప్పకుండా అవ్వాలి అని పావనంగా అయ్యే చింత ఉండాలి. ఇదే ముఖ్యమైన సబ్జెక్ట్. ఏ పిల్లలైతే పావనంగా అవుతారో వారే తండ్రి యొక్క సేవాధారులుగా అవ్వగలుగుతారు. తండ్రి ఒక్కరే ఏమి చేస్తారు? అందుకే పిల్లలు శ్రీమతముపై తమ యొక్క యోగబలముతోనే విశ్వాన్ని పావనంగా తయారుచేసి పావన రాజధానిని తయారుచేయాలి. మొదట స్వయాన్ని పావనంగా తయారుచేసుకోవాలి.

ఓం శాంతి. మేము బాబా వద్దకు రిఫ్రెష్ అవ్వడం కోసం వెళ్తామని పిల్లలు తప్పకుండా భావిస్తారు. అక్కడ సెంటర్లకు వెళ్ళినప్పుడు అలా భావించలేరు. బాబా మధుబన్ లో ఉన్నారు అని పిల్లలైన మీ బుద్ధిలో ఉంది. బాబా మురళి పిల్లల కోసమే వినిపించబడుతుంది. మేము మధుబన్ కు మురళిని వినేందుకు వెళ్తాము అని పిల్లలు భావిస్తారు. మురళి అన్న పదము శ్రీకృష్ణుడికి వర్తిస్తుందని అనుకున్నారు. మురళి అంటే ఇంకేదో అర్థము కాదు. పిల్లలైన మీకు ఇప్పుడు బాగా అర్థమయింది కదా. మేము చాలా బుద్ధిహీనులుగా అయిపోయామని భావిస్తారు. తండ్రి అర్థం చేయించారు మరియు మీకు కూడా అనిపిస్తుంది - తప్పకుండా మేము చాలా వివేకహీనులుగా అయిపోయాము అని. ఎవ్వరూ స్వయాన్ని ఈ విధంగా భావించరు. ఇక్కడకు ఎప్పుడైతే వస్తారో, అప్పుడు నిశ్చయబుద్ధి కలవారిగా ఉంటారు. తప్పకుండా మేము చాలా బుద్ధిహీనులుగా అయిపోయాము అని భావిస్తారు. మీరు సత్యయుగములో ఎంత వివేకవంతులుగా, విశ్వాధిపతులుగా ఉండేవారు. మూర్ఖులు ఎవరైనా అలా విశ్వాధిపతులుగా అవ్వగలరా? ఈ లక్ష్మీ-నారాయణులు విశ్వాధిపతులుగా ఉండేవారు, వారు ఎంతో వివేకవంతులుగా ఉండేవారు, అందుకే భక్తి మార్గములో పూజింపబడుతున్నారు. జడమైన చిత్రాలు ఏమీ చెప్పలేవు. శివబాబా పూజను చేస్తారు కానీ వారేమైనా మాట్లాడుతారా! శివబాబా ఒక్క సారే వచ్చి మాట్లాడుతారు. పూజ చేసే వారికి కూడా - ఈ జ్ఞానాన్ని వినిపించేవారు తండ్రి అన్నది తెలియదు. శ్రీకృష్ణుడు మురళిని మ్రోగించారని భావిస్తారు. ఎవరినైతే పూజిస్తారో వారి కర్తవ్యము గురించి ఏమాత్రమూ తెలియదు. కావున ఎప్పటివరకైతే తండ్రి రారో, అప్పటివరకూ ఈ పూజా మొదలైనవన్నీ నిష్ఫలమే అవుతాయి. పిల్లలైన మీలో చాలామంది వేదాలు, శాస్త్రాలు మొదలైనవేవీ చదవలేదు. ఇప్పుడు మిమ్మల్నీ ఆ సత్యమైన తండ్రి ఒక్కరే చదివిస్తున్నారు. తప్పకుండా సత్యముగా చదివించేది ఒక్క తండ్రేనని మీరు అర్థం చేసుకున్నారు. తండ్రిని సత్యము అనే అంటారు. వారు నరుడి నుండి నారాయణుడిగా తయారుచేసే సత్యమైన కథను వినిపిస్తారు. దాని అర్థము సరిగ్గా ఉంది. సత్యమైన తండ్రి వస్తారు, ఇప్పుడు నరుడి నుండి నారాయణుడిగా అవ్వాలి కావున తప్పకుండా సత్యయుగాన్ని స్థాపిస్తారు కదా. పాత ప్రపంచమైన కలియుగమైతే తయారవ్వదు కదా. కథ వినే సమయములో - మేము నరుని నుండి నారాయణునిగా అవుతాము అన్నది ఎవరికీ బుద్ధిలో ఉండదు. ఇప్పుడు మీకు నరుని నుండి నారాయణునిగా అయ్యే రాజయోగాన్ని నేర్పిస్తారు. ఇది కూడా కొత్త విషయమేమీ కాదు. తండ్రి అంటారు, నేను కల్ప-కల్పమూ వచ్చి అర్థం చేయిస్తాను. నేను ప్రతి యుగములోనూ ఎలా వస్తాను! బ్రహ్మా చిత్రాన్ని చూపించి, వీరు రథమని మీరు అర్థం చేయించవచ్చు. ఇది వీరి అనేక జన్మల అంతిమ జన్మ, ఇప్పుడు వీరు పతితంగా ఉన్నారు. ఇప్పుడు వీరు కూడా పావనంగా అవుతారు. మనము కూడా అలా అవుతాము. యోగబలము ద్వారా తప్ప ఇంకే విధంగానూ ఎవరూ పావనంగా అవ్వలేరు, వికర్మలు వినాశనమవ్వవు. నీటిలో స్నానం చేయడం ద్వారా ఎవ్వరూ పావనంగా అవ్వరు. ఇది యోగాగ్ని. నీరు అనేది అగ్నిని చల్లార్చేదిగా ఉంటుంది. అగ్ని అనేది కాల్చేదిగా ఉంటుంది. కనుక వికర్మలు వినాశనమయ్యేందుకు మరి నీరు అనేది అగ్ని ఏమీ కాదు. అందరికన్నా ఎక్కువగా గురువులు మొదలైనవారిని ఇతనే ఆశ్రయించారు, వీరు శాస్త్రాలను కూడా ఎన్నో చదివారు. ఈ జన్మలో పండితుని వలె ఉండేవారు, కానీ దాని వల్ల లాభమేమీ కలగలేదు. పుణ్యాత్మగా అయితే అవ్వరు కదా. పాపాలే చేస్తూ వచ్చారు. బాబా అర్థం చేయిస్తున్నారు - ఎవరైతే తమను తాము పిల్లలుగా భావిస్తారో వారు, ఈ జన్మలో ఏ పాపాలు మొదలైనవాటినైతే చేసారో, వాటన్నింటినీ తండ్రి సమ్ముఖములో వచ్చారు కావున వారికి పాప కర్మలను తెలియజేయాలి, తద్వారా తేలిక అవుతారు. ఈ జన్మలోని వాటి నుండి తేలిక అయిపోతారు. కానీ జన్మ-జన్మాంతరాల పాప కర్మల భారమేదైతే శిరస్సుపై ఉందో దానిని తొలగించుకోవటానికి మళ్ళీ పురుషార్థం చేయాలి. తండ్రి యోగము గురించి అర్థం చేయిస్తున్నారు.

యోగము ద్వారానే వికర్మలు వినాశనమవుతాయి. ఈ విషయాలను మీరు ఇప్పుడే వింటారు. సత్యయుగములో ఈ విషయాలను ఎవ్వరూ వినిపించలేరు. ఈ డ్రామా అంతా రచింపబడి ఉంది. క్షణ-క్షణమూ ఈ డ్రామా అంతా తిరుగుతూ ఉంటుంది. ఒక్క క్షణము మరుక్షణముతో కలవదు. క్షణ-క్షణమూ ఆయువు కూడా తగ్గిపోతూ ఉంటుంది. ఇప్పుడు మీరు ఆయువు తగ్గిపోకుండా బ్రేక్ వేస్తారు మరియు యోగము ద్వారా ఆయువును పెంచుకుంటారు. ఇప్పుడు పిల్లలైన మీరు మీ ఆయువును యోగబలముతో పెంచాలి. యోగము విషయములో బాబా ఎంతో అటెన్షన్ ఇప్పిస్తారు, కానీ కొందరు అర్థం చేసుకోరు. బాబా, మేము మర్చిపోతున్నాము అని అంటారు. అందుకే బాబా అంటున్నారు - యోగము అంటే ఇంకేమో కాదు, ఇది స్మృతి యాత్ర. తండ్రిని స్మృతి చేస్తూ-చేస్తూ పాపాలు అంతమవుతూ ఉంటాయి, అంతిమ స్థితిని బట్టి గతి ఏర్పడుతుంది. ఈ విషయములో ఒక ఉదాహరణను కూడా ఇస్తారు - ఒకరిని ఎవరో, నీవు గేదెవు అని అన్నారు, దానితో అతను 'నేను గేదెనే' అని భావించడం మొదలుపెట్టారు. ఆ తర్వాత అతడిని ఈ తలుపు నుండి బయటకు రా అని చెప్తే, నేను గేదెను కదా, బయటకు ఎలా రాగలను అని అన్నారట! నిజంగానే గేదెగా అయినట్లు భావించారు. వారు దీనిని ఒక ఉదాహరణగా తయారుచేసారు, కానీ వాస్తవానికి అటువంటిదేమీ లేదు. ఇదేమీ యథార్థమైన ఉదాహరణ కాదు. ఎల్లప్పుడూ నిజమైన విషయం పైనే ఉదాహరణను ఇవ్వడం జరుగుతుంది.

ఈ సమయంలో తండ్రి మీకేవైతే అర్థం చేయిస్తున్నారో వాటిని మళ్ళీ భక్తి మార్గంలో పండుగలుగా జరుపుకోవడం జరుగుతుంది. ఎన్ని మేళాలు మొదలైనవి జరుగుతూ ఉంటాయి. ఈ సమయంలో ఏవైతే జరుగుతూ ఉంటాయో అవన్నీ పండుగలు తయారవుతాయి. మీరు ఇక్కడ ఎంత స్వచ్ఛముగా అవుతారు. మేళాలు మొదలైనవాటిల్లోనైతే ఎంత మాలిన్యముగా అవుతారు, శరీరానికి మట్టి పూసుకుంటారు, దానితో పాపాలు తొలగిపోతాయని భావిస్తారు. బాబా స్వయం ఇవన్నీ చేసారు. నాసిక్ లో నీరు చాలా అశుద్ధముగా ఉంటుంది. అక్కడకు వెళ్ళి మట్టి పూసుకుంటారు, దానితో పాపాలు వినాశనమైపోతాయని భావిస్తారు, మళ్ళీ ఆ మట్టిని శుభ్రం చేసుకునేందుకు నీటిని తీసుకువస్తారు. ఎవరైనా పెద్ద మహారాజులు మొదలైనవారు విదేశాలకు వెళ్ళినప్పుడు గంగాజలమును కుండలో నింపుకొని తమతోపాటు తీసుకువెళ్ళేవారు, మళ్ళీ స్టీమర్లలో కూడా అవే నీరు తాగేవారు. పూర్వము విమానాలు, మోటార్లు మొదలైనవేవీ లేవు. 100-150 సంవత్సరాలలో ఏమేమి తయరయ్యాయో చూడండి! సత్యయుగ ఆదిలో ఈ సైన్స్ మొదలైనవి ఉపయోగపడతాయి. అక్కడ మహళ్ళు మొదలైనవి తయారుచేయడానికి పెద్ద సమయం పట్టదు. ఇప్పుడు మీ బుద్ధి పారసబుద్ధిగా తయారవుతుంది, కావున అన్ని పనులను సహజము చేసేస్తుంది. ఏ విధంగా ఇక్కడ మట్టితో ఇటుకలు తయారవుతాయో, అలాగే అక్కడ బంగారముతో తయారైనవి ఉంటాయి. ఈ విషయము గురించే మాయా మశ్చీంద్రుని ఆటను కూడా చూపిస్తారు. దీనిని చూపించడానికి వారు ఒక నాటకముగా తయారుచేసారు. నిజంగానే స్వర్గములో బంగారు ఇటుకలు ఉంటాయి. దానిని గోల్డెన్ ఏజ్ (స్వర్ణయుగము) అని అంటారు. దీనిని ఐరన్ ఏజ్ (ఇనుపయుగము) అని అంటారు. స్వర్గమునైతే అందరూ తలచుకుంటారు, వారి చిత్రాలు కూడా ఉన్నాయి. ఆది సనాతన ధర్మము అని అంటారు కూడా, మళ్ళీ హిందూ ధర్మమని అనేస్తారు. దేవతలు అనేందుకు బదులుగా హిందువులు అని అనేస్తారు ఎందుకంటే వికారులుగా ఉన్నారు కావున దేవతలు అని ఎలా పిలుచుకుంటారు. మీరు ఎక్కడకు వెళ్ళినా ఇది అర్థం చేయిస్తారు ఎందుకంటే మీరు సందేశకులు. తండ్రి పరిచయాన్ని ప్రతి ఒక్కరికీ ఇవ్వాలి. అప్పుడు కొందరు - అవును, మీరు సరిగ్గా చెప్తున్నారు, నిజంగానే ఇద్దరు తండ్రులు ఉన్నారు అని వెంటనే అర్థం చేసుకుంటారు. మరికొందరు - పరమాత్మ సర్వవ్యాపి అని అనేస్తారు. ఒకరి నుండి హద్దు వారసత్వము లభిస్తుంది, పారలౌకిక తండ్రి నుండి 21 జన్మల కొరకు అనంతమైన వారసత్వం లభిస్తుంది అని మీరు అర్థం చేసుకుంటారు. ఈ జ్ఞానము కూడా ఇప్పుడే ఉంది. అక్కడ ఈ జ్ఞానము ఉండదు. సంగమములోనే వారసత్వం లభిస్తుంది, అప్పుడిక 21 తరాలు మీరు జన్మ జన్మలూ రాజ్యం చేస్తారు. మీరు మొత్తం విశ్వానికి యజమానులుగా అవుతారు. ఇది మీకు ఇప్పుడు తెలిసింది. పక్కా నిశ్చయబుద్ధి కలవారు ఎవరైతే ఉన్నారో వారికి ఎటువంటి సంశయము ఉత్పన్నమయ్యే విషయమే ఉండదు. అనంతమైన తండ్రి నుండి అనంతమైన వారసత్వం లభిస్తుంది. శివబాబా వచ్చారంటే తప్పకుండా ఏదో వారసత్వాన్ని అయితే ఇస్తారు కదా. అందుకే బాబా అంటారు, ఈ బ్యాడ్జి చాలా బాగుంది, దీనిని సదా పెట్టుకుని ఉండాలి. ప్రతి ఇంటికీ సందేశాన్ని ఇవ్వాలి, ఆ తర్వాత వారు అంగీకరించినా, అంగీకరించకపోయినా అది వారి ఇష్టము. వినాశనం వస్తే భగవంతుడు వచ్చారని అర్థం చేసుకుంటారు. మీరు ఎవరికైతే సందేశాన్ని ఇచ్చి ఉంటారో వారు అప్పుడు - ఎవరా శ్వేత వస్త్రధారులైన దేవదూతలు అని గుర్తు చేసుకుంటారు. సూక్ష్మవతనములో కూడా మీరు ఫరిశ్తాలను చూస్తారు కదా! మమ్మా, బాబా యోగబలముతో ఈ విధముగా ఫరిశ్తాలుగా అవుతారు కావున, మీరు కూడా అలా అవుతారు - అని మీకు తెలుసు. ఈ విషయాలన్నింటినీ తండ్రి వీరిలోకి ప్రవేశించి మీకు అర్థం చేయిస్తారు. డైరెక్టుగా జ్ఞానాన్ని ఇస్తారు. బాబాలో ఏ జ్ఞానమైతే ఉందో అది పిల్లలైన మీలో కూడా ఉంది. ఎప్పుడైతే పైకి వెళ్తారో అప్పుడు

జ్ఞానము యొక్క పాత్ర కూడా పూర్తయిపోతుంది. ఆ తర్వాత ఏ పాత్ర లభిస్తే, ఆ సుఖము యొక్క పాత్రను అభినయిస్తారు మరియు ఈ జ్ఞానాన్ని మర్చిపోతారు.

కావున పిల్లలైన మీరు ఎక్కడకు వెళ్ళినా, సందేశకుల గుర్తు ఏమిటంటే - ఈ బ్యాడ్జి తప్పకుండా మీతో ఉండాలి. ఎవరైనా నవ్వినా పర్వాలేదు. అయినా దీనిని చూసి ఎందుకు నవ్వుతారు. మీరైతే యథార్థమైన విషయాన్ని వినిపిస్తారు - వీరు అనంతమైన తండ్రి, వీరి పేరు శివబాబా, వీరు కళ్యాణకారి, వీరు వచ్చి స్వర్గ స్థాపన చేస్తారు, ఇప్పుడు ఇది పురుషోత్తమ సంగమయుగము అని. ఈ జ్ఞానమంతా పిల్లలైన మీకు లభించింది. మరి దీనిని ఎందుకు మర్చిపోవాలి. విషయము చాలా సహజమైనది. నడుస్తూ, తిరుగుతూ తండ్రిని మరియు వారసత్వాన్ని స్మృతి చేయాలి. శాంతిధామము మరియు సుఖధామము ఉన్నాయి. పిల్లలైన మీరు ఇక్కడకు వస్తారు, మురళి విని వెళ్తారు, దానిని మళ్ళీ వినిపించాలి కూడా. కేవలం ఒక్క బ్రాహ్మణి మాత్రమే మురళిని వినిపించాలి అని కాదు. బ్రాహ్మణి తన సమానముగా తయారుచేసి సిద్ధం చెయ్యాలి, అప్పుడే అనేకుల కళ్యాణమును చేయగలుగుతారు. ఒకవేళ ఒక బ్రాహ్మణి ఎక్కడికైనా వెళితే మరొకరు సెంటరును ఎందుకు నడపలేరు! ధారణ చేయలేదా ఏమిటి? విద్యార్థులకు చదివే మరియు చదివించే అభిరుచి ఉండాలి. మురళి అయితే చాలా సహజమైనది, ఎవరైనా ధారణ చేసి క్లాస్ చేయించవచ్చు. ఇక్కడైతే తండ్రి కూర్చున్నారు. ఏ విషయములోనూ సంశయము కలగకూడదు అని తండ్రి పిల్లలకు చెప్తున్నారు. సర్వస్వమూ తెలిసినవారు ఒక్క తండ్రే. ఒకే లక్ష్యము-ఉద్దేశ్యము ఉంది, ఇందులో ప్రశ్నలు మొదలైనవి అడగవలసిన అవసరం కూడా లేదు. ఉదయం కూడా కూర్చొని పిల్లలకు స్మృతియాత్రలో సహాయం చేస్తాను. మొత్తం అనంతమైన పిల్లలందరూ గుర్తుంటారు. పిల్లలైన మీరందరూ ఈ స్మృతి సహాయముతో మొత్తం విశ్వమంతటినీ పావనంగా తయారుచేయాలి, ఇందులోనే మీరు మీ సహయోగమనే వేలును ఇస్తారు. మొత్తం ప్రపంచమంతటినీ పవిత్రముగా తయారుచేయాలి కదా. కావున అందరూ శాంతిధామములోకి వెళ్ళిపోవాలని తండ్రి పిల్లలందరి పైనా తమ దృష్టిని ఉంచుతారు కదా. అందరి ధ్యాసను అటువైపుకు లాగుతారు. తండ్రి అయితే అనంతములోనే కూర్చుంటారు. మొత్తం ప్రపంచమంతటినీ పావనంగా తయారుచేయడానికి నేను వచ్చాను. మొత్తం ప్రపంచమంతా పవిత్రముగా అవ్వాలని మొత్తం ప్రపంచమంతటికీ కరెంట్ ఇస్తున్నాను. ఎవరికైతే పూర్తి యోగబలము ఉంటుందో వారు అర్థం చేసుకుంటారు - బాబా ఇప్పుడు కూర్చొని స్మృతియాత్రను నేర్పిస్తున్నారు, దాని ద్వారా విశ్వములో శాంతి ఏర్పడుతుంది అని. పిల్లలు కూడా స్మృతిలో ఉన్నట్లయితే సహాయం లభిస్తుంది. సహాయకులైన పిల్లలు కూడా కావాలి కదా. ఈశ్వరీయ సేవాధారులు, నిశ్చయబుద్ధి కలవారే స్మృతి చేస్తారు. పావనముగా అవ్వడమే మీ మొట్టమొదటి సబ్జెక్ట్ అనగా పిల్లలైన మీరు తండ్రితో పాటు నిమిత్తముగా అవుతారు. తండ్రిని పిలవడమే - ఓ పతిత పావనా రండి అంటూ పిలుస్తారు. ఇప్పుడు వారు ఒంటరిగా ఏమి చేస్తారు? సేవాధారులైతే కావాలి కదా. మేము విశ్వాన్ని పవిత్రముగా చేసి మొత్తం విశ్వమంతటిపైనా రాజ్యం చేస్తామని మీకు తెలుసు. బుద్ధిలో ఎప్పుడైతే ఈ విధమైన నిశ్చయం ఉంటుందో అప్పుడు నషా ఎక్కుతుంది. మేము తండ్రి శ్రీమతము ద్వారా, మా యోగబలం ద్వారా మా కొరకు రాజధానిని స్థాపించుకుంటున్నామని పిల్లలైన మీకు తెలుసు. ఈ నషా ఎక్కాలి. ఇది ఆత్మికమైన విషయము. ప్రతి కల్పమూ బాబా ఈ ఆత్మిక బలముతో మనల్ని విశ్వాధిపతులుగా తయారుచేస్తారని మీకు తెలుసు. శివబాబా వచ్చి స్వర్గ స్థాపనను చేస్తారని కూడా మీరు భావిస్తారు. ఇప్పుడు శిరస్సుపై ఈ స్మృతియాత్ర యొక్క చింతయే ఉంది. పురుషార్థము చేయాలి. వ్యాపారాలు మొదలైనవి చేస్తూ కూడా స్మృతియాత్ర ఉండాలి. సదా ఆరోగ్యవంతులుగా చేయడానికి తండ్రి చాలా అద్భుతమైన సంపాదనను చేయిస్తారు. ఈ సమయములో సర్వస్వాన్ని మర్చిపోవలసి ఉంటుంది. ఆత్మలమైన మనం వెళ్తున్నాము, ఆత్మాభిమానులుగా అయ్యే అభ్యాసమును చేయించడం జరుగుతుంది. తింటూ, తాగుతూ, నడుస్తూ, తిరుగుతూ తండ్రిని స్మృతి చేయలేరా? బట్టలు కుడుతూ బుద్ధియోగము తండ్రి స్మృతిలో ఉండాలి. ఇది చాలా సహజము. 84 జన్మల చక్రము పూర్తయింది అనైతే భావిస్తారు. ఇప్పుడు తండ్రి ఆత్మలమైన మనకు రాజయోగాన్ని నేర్పించడానికి వచ్చారు. ఈ ప్రపంచము యొక్క చరిత్ర-భౌగోళము పునరావృతమవుతూ ఉంటుంది. కల్పక్రితము కూడా ఇలాగే జరిగింది, అది ఇప్పుడు మళ్ళీ పునరావృతమవుతోంది. ఈ పునరావృతమవ్వడము యొక్క రహస్యాన్ని కూడా తండ్రే అర్థం చేయిస్తారు. ప్రతి ఒక్కరికీ డ్రామాలో పాత్ర లభించి ఉంది, దానిని అభినయిస్తూ ఉంటారు. తండ్రిని స్మృతి చేసినట్లయితే సతోప్రధానముగా అవుతారని పిల్లలకు సలహాను ఇవ్వడం జరుగుతుంది. అప్పుడిక ఈ శరీరము కూడా పోతుంది. ఆత్మయైన మేము సతోప్రధానముగా అవ్వాలి ఎందుకంటే తిరిగి ఇంటికి వెళ్ళాలి అని మీ బుద్ధిలో ఇప్పుడు ఇదే ఉంది. సత్యయుగములో ఇలా అనరు. అక్కడైతే ఒక పాత శరీరాన్ని వదిలి ఇంకొకటి తీసుకోవాలి అని అంటారు. అక్కడైతే దుఃఖము యొక్క విషయమే ఉండదు. ఇక్కడ ఇది దుఃఖధామము. ఇవి పాత శరీరాలు కావున ఇప్పుడు వీటిని వదిలి తిరిగి తమ ఇంటికి వెళ్ళాలి అని భావిస్తారు. తండ్రిని నిరంతరమూ స్మృతి చేయాలి. ఆ నిరాకారుడైన తండ్రే జ్ఞానసాగరుడు. వారే వచ్చి

సర్వుల సద్గతిని చేస్తారు. నేను సాధువులను కూడా ఉద్ధరిస్తాను అని తండ్రి అంటారు. మీరు ఇప్పుడు ఒక్క తండ్రితోనే యోగాన్ని జోడించండి. ఆత్మలైన మీ అందరికీ తండ్రి నుండి వారసత్వాన్ని తీసుకునే హక్కు ఉంది. స్వయాన్ని ఆత్మగా భావిస్తూ దేహీ-అభిమానులుగా అవ్వండి మరియు తండ్రిని నిరంతరమూ స్మృతి చేయండి, తద్వారా పాపాలు అంతమైపోతూ ఉంటాయి. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. మురళిని విని మళ్ళీ వినిపించాలి. చదవడంతోపాటు చదివించాలి కూడా. కళ్యాణకారులుగా అవ్వాలి. బ్యాడ్జి సందేశకులకు గుర్తు, దీనిని సదా ధరించి ఉండాలి.

2. విశ్వములో శాంతిని స్థాపన చేయడానికి స్మృతియాత్రలో ఉండాలి. ఏ విధంగా తండ్రి దృష్టి అనంతములో ఉంటుందో, మొత్తం ప్రపంచమంతటినీ పావనంగా తయారుచేయడానికి వారు కరెంటును ఇస్తారో, అలా తండ్రిని అనుసరిస్తూ సహాయకులుగా అవ్వాలి.

వరదానము:- కర్మ మరియు యోగము యొక్క బ్యాలెన్సు ద్వారా కర్మాతీత స్థితిని అనుభవము చేసే కర్మబంధన ముక్త భవ

కర్మతోపాటుగా యోగము యొక్క బ్యాలెన్సు ఉన్నట్లయితే ప్రతి కర్మలో స్వతహాగానే సఫలత ప్రాప్తిస్తుంది. కర్మయోగీ ఆత్మ ఎప్పుడూ కర్మ యొక్క బంధనములో చిక్కుకోరు. కర్మ యొక్క బంధనము నుండి ముక్తులుగా ఉండేవారినే కర్మాతీతులు అని అంటారు. కర్మాతీతము అనగా కర్మ నుండి అతీతమైపోవటమని అర్థము కాదు. కర్మ నుండి అతీతము కాదు, కర్మ యొక్క బంధనములో చిక్కుకోవటము నుండి అతీతముగా అవ్వండి. ఇటువంటి కర్మయోగీ ఆత్మ తన కర్మలతో అనేకుల కర్మలను శ్రేష్ఠముగా తయారుచేసేవారిగా ఉంటారు. వారి కొరకు ప్రతి కార్యము మనోరంజకముగా అనిపిస్తుంది, కష్టమనేది అనుభవము అవ్వదు.

స్లోగన్:- పరమాత్మ ప్రేమయే అలారం గంట, అదే అమృతవేళ లేపుతుంది.